# నిజాయితీ

కొందరు తమ బాస్ చూస్తున్నారనుకుంటే - అక్కడికేదో ఆఫీస్ పనంతా తమ భుజస్కంధాల మీదే జరిగిపోతున్నట్టు హడావిడి చేస్తారు ! బాస్ కనుసన్నల్లో పడే దాకా పడరాని పాట్లు పడుతూ..... బాస్ కనుమరుగైన మరుక్షణం..... కుర్చీలో చేరగిలబడి కునుకుదీస్తారు !

కొంతమంది ఫోన్ తమదైతే తాళమేసుకుంటారు. అదే ఆఫీస్ ఫోనయితే అటూ ఇటూ చూసి.... తమని ఎవరూ చూట్టం లేదనుకుంటే పోచికోలు కబుర్లన్నీ గంటల తరబడి ఎస్టీడీల్లో చెప్పుకుంటారు !

మరికొంతమంది బజార్లో తమకేదైనా 'పర్సనల్ పని' ఉందనుకుంటే 'ఆఫీస్ పని సాకుతో - ఆఫీస్ కార్లో బయల్దేరి - 'ఆఫీస్ పని మూరెడు - పర్సనల్ పని బారెడు 'చేసుకుని వస్తారు !

మనవి కాని వస్తు వాహనాలను వాడుకోవాలనుకోవడం.....

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం....

ఫ్రెంచి లీవుల్తో పని ఎగ్గొట్టడం....

చేస్తోన్న పనిలో అలసత్వం.....

తదితర కారణాలన్నీ.... ప్రభుత్వరంగ సంస్థల్ని నష్టాల ఊబిలోకి నెట్టి, ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపేలా చేస్తాయి !

తాము చేస్తోన్న పనిని ఒకరు గమనిస్తున్నారన్న 'ప్రత్యేక స్పృహ' ఏదీ తెచ్చి పెట్టుకోకుండా - **తమపై 'నిఘా' ఉన్నా లేకున్నా- తమ పనిని తాము సజావుగా, నిజాయితీగా చేసుకునే ఉద్యోగులు జాతి ప్రగతికి పట్టుకొమ్మలు !**

అది ప్రభుత్వ సంస్థగానీ - ప్రైవేటు సంస్థగానీ - ఉద్యోగులందరూ నిజాయితీగా ఆయా సంస్థల ఆస్తికి 'ధర్మకర్త'ల్లా వ్యవహరించినపుడే -

ఏ సంస్థయినా విజయపథంలో పయనిస్తుంది ! లాభాల సిరుల్ని పండిస్తుంది !

16-11-1995